# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-12-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ లోని పార్వతీపురం మన్యం జిల్లాలో నిర్వహించే తల్లిదండ్రులు- ఉపాధ్యాయుల సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పాల్గొంటారు.**

2. **తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాకు సాగునీరు ఇచ్చే లక్ష్యంతో ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు.**

3. **ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్మాణ పనులకు 169 కోట్ల రూపాయలను కేటాయించామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు.**

4. **ఆరోగ్యాంధ్రప్రదేశ్ గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు వైద్యులందరూ కృషి చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు.**

5. **ఆంధ్రప్రదేశ్ లో రైతులకు బస్తాకు 1,792 రూపాయలతో కనీస మద్దతు ధర కల్పిస్తున్నామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోతల్లిదండ్రులు–ఉపాధ్యాయుల బృహత్ సమావేశం –మెగా పీటీఎంను ఈరోజు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది. ఇందులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలంలోని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో జరగనున్న సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ లు పాల్గొంటారు. ఈ సమావేశం ద్వారా పిల్లల చదువు, ప్రవర్తన, ఇతర నైపుణ్యాల పురోగతిని తల్లిదండ్రులు నేరుగా ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవచ్చు. అలాగే విద్యార్థుల సమగ్ర ప్రోగ్రెస్ కార్డులను ఈ సందర్భంగా తల్లిదండ్రులకు అందజేస్తారు.

--------------------------

తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా పంట పొలాలకు సాగునీరు ఇచ్చే లక్ష్యంతో ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని మైదానంలో నిర్వహించిన 'ప్రజా పాలన– ప్రజా విజయోత్సవ' కార్యక్రమంలో ముఖ్యమంత్రి నిన్న పాల్గొని 260.45 కోట్ల రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. అనంతరం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, 150 మీటర్ల ఎత్తులో ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టుకు తుమ్మిడిహట్టి వద్ద త్వరలోనే పనులు ప్రారంభించి ప్రాజెక్టును చేపట్టే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. ఆదిలాబాద్ అభివృద్ధికి రెండు నెలల్లో ప్రత్యేక ప్రణాళికను

రూపొందించి నిధులను మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో లోక్ భవన్ తో పాటు, ఇతర సముదాయాల నిర్మాణ పనులకు 169 కోట్ల రూపాయలను కేటాయించామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన సీఆర్డీఏ 55వ అథారిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి నిన్న పాత్రికేయులకు వివరించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ

వాయిస్ 25 సెకన్లు

--------------------------

ఆరోగ్యాంధ్రప్రదేశ్ గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు వైద్యులందరూ కృషి చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు. విజయవాడలో నిర్వహించిన "ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం"లో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ, వైద్య వృత్తిని ఉద్యోగంగానే కాకుండా సేవాభావంతో నిర్వర్తించాలని తెలిపారు.ప్రభుత్వం చేపడుతున్న క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన తీసుకురావడంలో, వైద్యాన్ని అందించడంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కృషి చేయాలని కోరారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ లో మహిళల రక్షణకు ప్రాధాన్యతనిస్తూ శక్తి టీమ్స్, శక్తి యాప్ ను ఏర్పాటు చేశామని హోం:శాఖ మంత్రి వి.అనిత పేర్కొన్నారు. దేశంలో మహిళలకు అత్యంత సురక్షితమైన నగరంగా విశాఖపట్నం – నారీ 2025 గా గుర్తింపు పొందిన సందర్భంగా విశాఖపట్నం బీచ్ రోడ్డులో నిన్న సాయంత్రం నిర్వహించిన ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణలో కృషి కారణంగా పోలీసు శాఖ పనితీరుతో అత్యంత సురక్షితమైన నగరంగా జాతీయ స్థాయిలో విశాఖపట్నం గుర్తింపు పొందడం హర్షణీయమన్నారు. పురుషులతో పాటు మహిళలు కూడా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. గంజాయి, మాదక ద్రవ్యాల రవాణ పై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ లో రైతులకు బస్తా ధాన్యాకి 1,792 రూపాయలతో కనీస మద్దతు ధర కల్పిస్తున్నామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు విజయవాడలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, అత్యంత పారదర్శకంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిర్వహిస్తున్నామని తెలిపారు.

వాయిస్ 35 సెకన్లు

--------------------------

"రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం" కింద సివిల్స్ మెయిన్స్, ఇంటర్వ్యూలకు ఎంపికైనా వారందరికి లక్ష రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్ లోని ప్రజాభవన్‌లో యూపీఎస్సీ ఇంటర్వ్యూలకు ఎంపికైన 50 మందికి మంత్రి పొన్నం ప్రభాకర్ తో

కలిసి ఆయన నిన్న చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, సివిల్స్ అభ్యర్థుల అభిప్రాయాలతో ఈ పథకాన్ని మరింత సరళంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. సివిల్స్ అభ్యర్థులు ఇంటర్వ్యూలను సమర్థంగా ఎదుర్కొనేలా ప్రభుత్వంలోని సీనియర్ బ్యూరోక్రాట్లతో ఇంటర్వ్యూ బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు ఉపముఖ్యమంత్రి వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని ఆకాశవాణి విజయవాడ కేంద్రం ఏర్పాటు చేసి 77 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిన్న విజయవాడలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ నగర పూర్వ మేయర్ జంధ్యాల శంకర్, తానా సంస్థ పూర్వ అధ్యక్షులు తోటకూర ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జంధ్యాల శంకర్ మాట్లాడుతూ తెలుగు భాష ప్రామాణికతకు ఆకాశవాణి కార్యక్రమాలు చిహ్నంగా నిలుస్తున్నాయని అన్నారు. తోటకూర ప్రసాద్ మాట్లాడుతూ ఆకాశవాణి కార్యక్రమాలు నాటి కాలం నుంచి నేటికీ శ్రోతల మన్ననలు పొందుతున్నాయన్నారు. అంతకుముందు ఆకాశవాణి కేంద్రం డిడిజి ఎం. సోమేశ్వర రావు ప్రారంభోపన్యాసంలో మాట్లాడుతూ, ఆకాశవాణి శ్రోతలకు, సమాజానికి ఉపయోగపడే ప్రజాహిత కార్యక్రమాలు రూపొందించి ప్రసారం చేస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా జానపద కళాకారులకు 50 రేడియోలను బహుకరించడంతో పాటు, ఆకాశవాణిలో పనిచేసి, పదవీ విరమణ పొందిన సిబ్బందిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో రేడియో అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానా దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో రానున్న మూడు రోజులపాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ,

వాయిస్..29 సెకన్లు

మరోవైపు.. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చలితీవ్రత కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్లోని మన్యం ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తెలంగాణాలోని ఉత్తర తెలంగాణ జిల్లాలలో చలితీవ్రత పెరిగిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న రెండవ దశ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ – సర్ లో భాగంగా ఆరాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అరిందం నియోగి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన నిన్న సమావేశం నిర్వహించి, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్ ప్రక్రియలో ప్రజలు పాల్గొనేలా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఫారమ్‌ల డిజిటలీకరణ పని 92 శాతం మేర పూర్తయిందని అన్నారు.

---------------------------

మానవ జీవితంలో నేల ఆవశ్యకతను తెలియజేస్తూ ఈ రోజు ప్రపంచ మృత్తికా దినోత్సవం నిర్వహిస్తున్నారు. భూ కాలుష్యం, పురుగు మందులు, రసాయన ఎరువుల వాడకం, నేలను నానాటికీ బలహీనం చేస్తున్నాయి. ఇటువంటి అనారోగ్యకర వాతావరణాన్ని నివారించి భూమిని భూసారాన్ని పరిరక్షించే ఉద్దేశ్యంతో మృత్తికా దినోత్సవం

నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ సాయిల్ సైన్సెస్ యూనియన్ – ఐయుఎస్ఎస్ పిలుపు మేరకు ప్రతి ఏటా డిసెంబర్ 5 వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది.

======================